ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 28 సెప్టెంబరు 2025



1, 2 తేదీల్లో ఆదిత్యుడ్ని తాకనున్న కిరణాలు

అరసవల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అయిన అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామిని అక్టోబరు 1, 2 తేదీల్లో సూర్యకిరణాలు తాకనున్నాయి. ఆ రెండు రోజులు ఉదయం 6.13 గంటల నుంచి సుమారు నాలుగు నుంచి ఆరు నిమిషాలపాటు ఆదిత్యుడి మూలవిరాట్‌ను సూర్యకిరణాలు తాకుతాయని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చి ఈ అద్భుత దృశ్యాన్ని తిలకించాలని కోరారు.

అమృత్ భారత్ వచ్చేసింది

- బరంపురం నుంచి సూరత్ వరకూ ఎక్స్‌ప్రెస్ రైలు
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన పీఎం మోదీ
- శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో కేంద్రమంత్రి స్వాగతం
- రైల్వేసేవలు మెరుగుపరుస్తామని రామ్మోహన్ వెల్లడి



పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకున్న అమృతభారత్ రైలు



ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో అమృతభారత్‌కు స్వాగతం పలికిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చేసింది. ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి సూరత్ వరకూ రాకపోకలు సాగించనున్న ఈ ప్రత్యేక రైలు పట్టాలెక్కింది. శనివారం బరంపూర్ రైల్వే స్టేషన్ వద్ద అమృత్‌భారత్ రైలును ప్రధానమంత్రి మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో 'అమృత్‌భారత్'కు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆచరిస్తున్న (మిగతా 8వ పేజీలో..)

పలాసలో అమృత్ భారత్ రైలుకు ఘన స్వాగతం 8లో



బాలాత్రిపుర సుందరికి పసుపుకొమ్ములతో అర్చన



కాత్యాయనిగా దుర్గమ్మ

- లక్ష పసుపుకొమ్ములతో పూజలు

అరసవల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ శనివారం కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. శ్రీకాకుళం నగరం బలగలోని నాగావళి నదీ తీరాన ఉన్న శ్రీ బాలాత్రిపుర కాలభైరవాలయంలో కాత్యాయని దేవికి లక్ష పసుపుకొమ్ములతో భక్తులు పూజలు చేశారు. అలాగే పాత శ్రీకాకుళంలోని శ్రీసంతోషిమాతకు సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, కుంకుమపూజ, శ్రీసూక్తం తదితర సేవలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కార్పొరేషన్‌కు 78వ ర్యాంకు

- అత్యంత దిగువకు ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మునిసిపాలిటీలు
- పది అంశాల ఆధారంగా సర్కారు రేటింగ్

మునిసిపాలిటీ	రేటింగ్	స్కోర్	ర్యాంకు
శ్రీకాకుళం కార్పొరేషన్	5	50	78
ఆమదాలవలస	4	33	91
ఇచ్ఛాపురం	4	35	98
పలాస-కాశీబుగ్గ	4	38	108

శ్రీకాకుళం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మునిసిపాలిటీలకు ర్యాంకులు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా 123 మునిసిపాలిటీలకు పది అంశాల ఆధారంగా రేటింగ్ ఇచ్చింది. జిల్లాకు సంబంధించి శ్రీకాకుళం నగరపాలక సంస్థకు 78వ ర్యాంకు లభించింది. మొత్తం 100 మార్కులకుగానూ 50 పాయింట్లతో మధ్యస్థంగా 5వ రేటింగ్ దక్కింది. ప్రభుత్వం తాగునీటి సరఫరా, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాలు, వరద నీటి నిర్వహణ, రోడ్లు, (మిగతా 8వ పేజీలో..)





శుక్రవారం నరసన్నపేటలో జీఎస్టీ అధికారుల దాడులతో మూతపడిన బంగారం దుకాణాలు

మాది.. అడ్డదారి!

- గత నెల 26న నరసన్నపేటకు చెందిన బంగారం వ్యాపారి పొట్నూరు రామేశ్వర గుప్త హత్యకు గురయ్యారు. ఈయన దొడ్డిదారిన బంగారం వ్యాపారం చేసి.. కొద్దికాలంలోనే కోటీశ్వరుడిగా ఎదిగారు. ఈ క్రమంలో విశాఖ నుంచి బంగారం కొనుగోలు చేసి వస్తుండగా.. కారుడ్రైవర్ అత్యాశకుపోయి గుప్తను పథకం ప్రకారం హతమార్చాడు. ఆ బంగారాన్ని కాజేసేందుకు యత్నించి.. కొన్నిరోజుల తర్వాత కటకటాలపాలయ్యారు. అదే బంగారం వ్యాపారాన్ని సక్రమంగా అంటే బిల్లు మీద కొనుగోలు చేసుంటే హత్యకు గురయ్యేవారు కాదేమో. .
- ఇటీవల నరసన్నపేటకు చెందిన ఒక బులియన్ వ్యాపారి ఒడిశాకు చెందిన వ్యాపారులకు బంగారం ఆభరణాలను విక్రయించారు. ఎటువంటి బిల్లులు ఇవ్వలేదు. దీంతో ఒడిశా వ్యాపారులు తమకేమీ బంగారం విక్రయించలేదని బుకాయించారు. ఈ క్రమంలో వారి చేతిలో నరసన్నపేట వ్యాపారి సుమారు రూ.60లక్షల వరకూ పోగొట్టుకున్నారు.
- 2018లో ఒక బులియన్ హోల్‌సేల్ దుకాణదారుడు తన కుమారుడ్ని నరసన్నపేట నుంచి విశాఖపట్నం కారులో బంగారం కొనుగోలు కోసం పంపించారు. కారుడ్రైవర్ తన స్నేహితులతో కలిసి.. బంగారం వ్యాపారిని బెదిరించి సుమారు రూ.కోటి చోరీ చేశారు. అప్పట్లో ఈ సంఘటనపై నరసన్నపేట పోలీసు స్టేషన్‌లో పంచాయితీ పెట్టి.. హోల్‌సేల్ వ్యాపారి చోరీదారుల నుంచి కొంత డబ్బును రాబెట్టుకున్నారు. ఈ వ్యవహారం బయట పడకుండా సెటిల్ చేశారు.

నరసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి):

- నరసన్నపేటకు అక్రమంగా బంగారం దిగుమతి
- గుప్త హత్య జరిగినా.. వెనక్కి తగ్గని వ్యాపారులు
- ఆదాయపు పన్ను ఎగ్గొట్టేలా క్రయవిక్రయాలు

..ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నా.. నరసన్నపేటలో కొందరు దొడ్డిదారిలోనే బంగారం వ్యాపారాలు చేస్తూనే ఉన్నారు. నరసన్నపేటలో బంగారం వ్యాపారాలపై ఓ కన్ను వేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఇటీవల క్రైం మీటింగ్‌లో ఆదేశాలు జారీ చేసినా.. దొడ్డిదారిలోనే చాపకింద నీరులా వ్యాపారాలు సాగిస్తున్నారు. చాలామంది జీరో ట్యాక్స్ వ్యాపారం కొనసాగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బంగారం ధరలు మరింత పెరుగుతాయనే ఉద్దేశంతో కొందరు వ్యాపారులు విశాఖపట్నం, విజయవాడ, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం, కోయంబత్తూరు, చెన్నై నుంచి బంగారాన్ని, ఆభరణాలను నరసన్నపేటకు దిగుమతి చేశారు. తమ వద్ద పనిచేసే నమ్మకం కలిగిన వ్యక్తులను ఈ పనికి వినియోగిస్తున్నారు. కొంతమంది ట్రావెల్స్ ఆర్టీసీ బస్సుల్లో కూడా బంగారా న్ని ప్యాకింగ్ చేసి.. బ్యాగ్‌లో పెట్టి.. దిగు మతి చేస్తున్నారని సమాచారం.

దొడ్డిదారినే ఎందుకంటే..

బంగారం కొనుగోలు చేయాలంటే ప్రభుత్వానికి 4శాతం పన్ను చెల్లించాలి. కొనుగోలు చేసిన బంగారాన్ని విక్రయించిన సందర్భంలో కూడా లెక్కలు చూపాలి. మరో 4శాతం పన్ను చెల్లించాలి. అదే జీరో ట్యాక్స్‌పై విక్రయిస్తే 100 గ్రాముల బంగారం బిస్కెట్‌కు సుమారు రూ.10 వేల వరకూ వ్యాపారులకు మిగులుతుంది. పన్ను చెల్లించి కొనుగోలు చేసే బంగారం బిస్కెట్‌లో 24క్యారెట్లు ఉంటుంది. పన్ను చెల్లించకపోతే ఆ స్వచ్ఛత ఉండదు. అచ్చం స్వచ్ఛమైన బంగారం వలె బిస్కెట్‌పై బీఐఎస్ ముద్ర ఉంటుంది కానీ.. మిల్లీగ్రాముల్లో నాణ్యత తగ్గించి ఉంటుంది. అయినా సరే ప్రభుత్వానికి ఆదాయ పన్ను ఎగ్గొట్టేందుకు చాలామంది వ్యాపారులు దొడ్డిదారిన క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. ఏడాది టర్నోవర్ మేరకు బంగారం వ్యాపారం చేసేవారిపై ఆదాయపు పన్ను పడుతుంది. ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చే వ్యాపారులకు తెల్లరేషన్ కార్డు ఉండదు. ఆరోగ్యశ్రీ కార్డు వర్తించదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదు. ఇలా ప్రభుత్వ పథకాలు పొందేందుకు అనర్హులు అవుతారు. ఈ నేపథ్యంలో చాలామంది వ్యాపారులు జీరోట్యాక్స్ విక్రయాల వైపు మొగ్గు చూపుతున్నారు. రూ.కోట్లలో లావాదేవీలు చేసే (మిగతా 8వ పేజీలో..)

బకాయిలను విడుదల చేయాలి

- సచివాలయ ఉద్యోగుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద నిరసన 9లో



కలెక్టరేట్ వద్ద సచివాలయ ఉద్యోగుల నిరసన

అమ్మానాన్నలకు అండగా.. అందరికీ ఆదర్శంగా..
- తోడుగా నిలుస్తున్న ఆడబిడ్డలు
- నేడు కుమార్తెల దినోత్సవం 8లో

వారసత్వ సంపదను పరిరక్షించాలి
- జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు 9లో

పాఠశాల స్థలం ఆక్రమణపై నిరసన 10లో

వడ్డీలేని రుణం.. వీధి వ్యాపారులకు వరం

- కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో ప్రారంభమైన రుణమేళా
- జిల్లాలో 6,964 మంది వ్యాపారుల గుర్తింపు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం రోడ్డుపక్కన, వీధుల్లో చిరు వ్యాపారం చేసేవారికి వడ్డీలేని రుణాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. చాలా మంది వీధి వ్యాపారులు అధిక వడ్డీకి రుణాలు తెచ్చి పెట్టుబడి పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. వారి కష్టంలో అధిక శాతం వడ్డీలు చెల్లించేందుకే సరిపోతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక్‌కళ్యాణ్ మేళా పీఎం స్వనిధి 2.0 పథకం ద్వారా వీధి వ్యాపారులకు వడ్డీలేని రుణాలు అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 25 నుంచి జిల్లాలోని శ్రీకాకుళం కార్పొరేషన్, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీల్లో ప్రత్యేక రుణమేళాలను నిర్వహిస్తున్నారు. మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల పేర్లను నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 6,964 మంది వీధి వ్యాపారులు రిజిస్టర్ అయ్యారు. వీరంతా కార్పొరేషన్, మునిసిపాలిటీ కార్యాలయాల్లో వడ్డీ లేని రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి. దాదాపు అందరికీ రుణాలు మంజూరు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

- గతంలో రుణాలు తీసుకుని చెల్లించిన వారికి మరింత అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయనున్నారు. ఈ మేరకు రుణ పరిమితిని పెంచారు. గతంలో రూ.10వేలు తీసుకున్న వారికి రూ.50 వేల వరకు రుణం ఇవ్వనున్నారు. అలాగే ప్రాథమిక రుణం గతంలో రూ.10వేలు ఉండేది. దీనిని ఇప్పుడు రూ.15వేలకు పెంచారు. మునిసిపాలిటీల వారీగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో మెప్మా అధికారులతోపాటు బ్యాంకు అధికారులు కూడా పాల్గొని రుణాలను మంజూరు చేస్తారు.

● గతేడాది కన్నా అధికంగా..

గత ఏడాది జిల్లాలో 2,674 మంది వీధి వ్యాపారులకు రూ.6,26,90,000 రుణాలను అందజేశారు. మునిసిపాలిటీల్లో వీధి వ్యాపారులకు మరింత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది అదనంగా 4,290 మంది వీధి వ్యాపారులను రిజిస్టర్ చేయించారు. ప్రస్తుతం మొత్తం 6,964 మంది వీధి వ్యాపారులు ఉండగా.. సుమారు రూ.16 కోట్లకు పైగా రుణాలను పంపిణీ చేయనున్నారు.



శ్రీకాకుళంలో వీధి వ్యాపారులు

జిల్లాలో వీధి వ్యాపారులు

శ్రీకాకుళం కార్పొరేషన్	2,997
పలాస	1,902
ఇచ్ఛాపురం	1,315
ఆమదాలవలస	750
మొత్తం	6,964

ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా..



పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా వీధి వ్యాపారులను ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా రుణాలు అందజేస్తున్నాం. గత ఏడాది కన్నా ఈ సంవత్సరం సర్వే చేపట్టి 4,290 మందిని అదనంగా రిజిస్టర్ చేయించాం. ఈ ఏడాది వారికి సుమారు రూ.16కోట్ల రుణాలు అందజేస్తాం. గతంలో తిరస్కరణకు గురైన వారిని కూడా పిలిచి రుణ సదుపాయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

-ఎస్.వెంకటరావు, మెప్మా పీడీ

వీధుల్లో వర్షపునీరు ఉండరాదు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు నగర వీధుల్లో నిలిచిపోవడానికి వీల్లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం శ్రీకాకుళంలోని ఏడురోడ్ల జంక్షన్, పాతబ్రిడ్జి, ముత్యాలమ్మ మార్కెట్, సత్యానగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కాలువలు, రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. వర్షపు నీరు నిల్వ ఉండడం గమనించి, తక్షణ చర్యల కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాలువలపై ఎక్కడైనా నిర్మాణాలు ఆటంకం కలిగిస్తే, వెంటనే వాటిని తొలగించాలని స్పష్టం చేశారు. ఆర్అండ్‌బీ నిధులతో రోడ్లకు ఇరువైపులా కాలువలను పునరుద్ధరించి, ఎటువంటి అడ్డంకులు లేకుండా వర్షపు నీరు నదిలోకి చేరేలా చర్యలు చేపట్టాలని (మిగతా 8వ పేజీలో..)



శ్రీకాకుళంలో కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అమ్మానాన్నలకు అండగా..

అందరికీ ఆదర్శంగా

- విజయాలు సాధిస్తున్న ఆడబిడ్డలు
- నేడు కుమార్తెల దినోత్సవం

ఒకప్పుడు ఆడపిల్ల పుడితే ఇబ్బందిగా భావించేవారు. కుమార్తెను గుండెల మీద కుంపటి అనుకునేవారు. కూతుళ్లను చదివించడం వ్యర్థమని.. విద్య కోసం వెచ్చించే మొత్తాన్ని పెళ్లికి కేటాయిస్తే సరిపోతుందనే భావనతో ఉండేవారు. రానురానూ జనంలో ఆ అభిప్రాయం మారుతూ వస్తోంది. ఆడపిల్లలను తల్లిదండ్రులు సాకే విధానంలోనూ మార్పు వచ్చింది. కుమార్తెలూ అంతే.. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి.. తాము అనుకున్న లక్ష్యాలను సాధించడంలో ముందుంటున్నారు. ఆటలు.. పాటలు.. చదువులు.. సేవలు.. ఇలా అన్ని రంగాల్లో తమదైన ముద్ర చూపిస్తున్నారు. దీనికి అదనంగా జీవిత చరమాంకంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకుంటున్న వారిలో కుమార్తెలే అధికంగా ఉంటున్నారు.

తండ్రి కలను నేరవేర్చిన కుమార్తెలు..


ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్న అక్కాచెల్లెళ్లు

నరసన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం కె. కొత్తూరుకు చెందిన కొండాల పాపయ్య, లక్ష్మీబాయి దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. తన కుమార్తెలను ఉపాధ్యాయులుగా చూడాలన్న తండ్రి ఆకాంక్షను వారు నెరవేర్చారు. పెద్దకుమార్తె కొండాల లీలవతి 1996లో ఉపాధ్యాయు రాలిగా ఎంపిక య్యారు. ప్రస్తుత్తం నరసన్నపేట మండలం సత్యవరం ఉన్నత పాఠశాలలో బయాలజీ అసిస్టెంటుగా పని చేస్తున్నారు. రెండో కుమార్తె కొండాల లత నరసన్నపేట బాలికోన్నత పాఠశాలలో పీఎస్ స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. మూడో కుమార్తె కొండాల జ్యోతి 2002లో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ప్రస్తుతం నరసన్నపేట మండలం రెడ్డికపేట పాఠశాలలో ఉపాధ్యాయుని గా పనిచేస్తున్నారు. 30 ఏళ్ల క్రితం కుమార్తెలంటే చిన్న చూపు ఉన్న రోజుల్లో ఆ తండ్రి బిడ్డలకు పట్టుపట్టి చదివించారు. ఆ కుమార్తెలూ అంతే.. తండ్రిని కలను అర్థం చేసుకొని.. నెరవేర్చడానికి తపించారు. నిజం చేసి చూపించారు.

తండ్రి గెలుపులో కీలకమై...


తండ్రి రమణమూర్తితో ప్రచారంలో పాల్గొన్న బగ్గు అర్చన (ఫైల్)

నరసన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో తండ్రికి చేదోడుగా నిలుస్తోంది ఆ కుమార్తె. ఆయన గెలుపులోనూ కీలక పాత్ర పోషించిందామె. తండ్రిని ఎమ్మెల్యేగా చూడాలనే తపనతో యూఎస్‌ఏలో ఉద్యోగాన్ని విడిచిపెట్టి స్వదేశానికి వచ్చారు. ఆమె నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుమార్తె బగ్గు అర్చన. 2014 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీడీపీ అభ్యర్థిగా బగ్గు రమణమూర్తికి టిక్కెట్ వచ్చిన సమయానికి భర్తతో యూఎస్‌ఏలో ఉద్యోగం చేసుకుంటున్నారు అర్చన. ఆ సమయంలో ఉద్యోగాన్ని వదలి.. తండ్రి గెలుపు కోసం తనదైన శైలిలో సహాయ సహకారాలు అందించారు. 2019 ఎన్నికల సమయానికి ఆమె యూఎస్‌ఏలో ఉన్నారు. మళ్లీ 2024 ఎన్నికల సమయంలో ఆమె రంగంలోకి దించారు. తన గెలుపు కోసం అర్చన ఎంతో శ్రమించారని స్వయంగా ఎమ్మెల్యే రమణమూర్తి తన సన్నిహితులు, బంధువులు వద్ద తెలిపారు.

అమ్మ లేని లోటు తీర్చుతూ..


ఉపాధ్యాయినిగా ఎంపికైన వాన దివ్య

నరసన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తల్లి అనారోగ్యంతో మృతిచెందినా.. ఆ లోటును తన సోదరులకు ఏనాడూ తెలియనివ్వలేదు ఆ సోదరి. అమ్మలా సేవలందించిది. తన తండ్రికి అండగా నిలిచింది. ఇటీవల డీఎస్సీలో రెండో ప్రయత్నంలో పీఈటీగా ఎంపికైంది. ఆమె జమ్ము గ్రామానికి చెందిన వాన దివ్య. తాను ఇంటర్ చదివే రోజుల్లో తల్లి సుశీల అనారోగ్యంతో మృతిచెందారు. పెద్ద సోదరికి వివాహమైంది. దీంతో దివ్య తన సోదరులు కార్తీక్, ప్రశాంత్‌లకు, తండ్రి రాముకు చేదోదువాదోడు గా ఉంటూ వచ్చారు. ఒక స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తూ.. మరో వైపు ఉపాధ్యాయిని కావాలనే తపనతో చదివి పీఈటీగా ఎంపికయ్యారు.

కష్టపడి...విజేతలుగా మలచి..


ముగ్గురు కుమార్తెలతో తల్లి నాగమ్మ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి పిల్లలను చదివిస్తూ వచ్చారు. ఇంతలో రోడ్డు ప్రమాదం రూపంలో తండ్రిని మృత్యువు కబళించింది. కానీ ఆ తల్లి ఏమాత్రం ధైర్యాన్ని కోల్పోకుండా... పిల్లలు ముగ్గురిని చదివించింది. తల్లి రెక్కల కష్టంతో చదువుకున్న ముగ్గురు ప్రయోజకులయ్యారు. ఆ తల్లిదండ్రులు ఇచ్ఛాపురానికి చెందిన దక్కత మోహనరావు, నాగమ్మ దంపతులు. వారికి సంధ్య, నీరజ, భారతి అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మోహనరావు లారీ డ్రైవర్, నాగమ్మ టైలర్. 2012లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోహనరావు మరణించారు. కానీ నాగమ్మ ధైర్యాన్ని కోల్పోలేదు. ఒంటరి మహిళగా ఎన్నెన్నో కష్టాలు ఎదురైనా ముగ్గురు ఆడపిల్లలను చదివించింది. పెద్ద కుమార్తె సంధ్య ఈ ఏడాది ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. రెండో కుమార్తె నీరజ ఇంజనీరింగ్ పూర్తి చేసి.. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం సాధించింది. మూడో కుమార్తె భారతి టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. ప్రస్తుతం నూజివీడులో రెండో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతోంది. తమ ఉన్నతికి పాటుపడిన తల్లి నాగమ్మను బాగా చూసుకుంటామని ముగ్గురు కుమార్తెలు చెబుతున్నారు. భర్త చనిపోయినా పిల్లల ఉన్నతిలో అతడిని చూసుకుంటానని నాగమ్మ గర్వంగా చెబుతున్నారు.

కూతురే సర్వమై...


కుమార్తెతో ధనలక్ష్మి

మెళియాపుట్టి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండలం కొరసవాడ గ్రామానికి చెందిన బి.ధనలక్ష్మికి ఒక కుమార్తె ఉంది. తాను వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగం చేస్తూ.. తన కుమార్తెను డాక్టర్‌గా చూడాలని ఆశించారు ధనలక్ష్మి. ఆ కుమార్తె కష్టపడి చదివింది. ప్రస్తుతం పాతపట్నం మండలంలోనే పశువైద్యురాలుగా సేవలు అందిస్తోంది. తల్లిని తన వద్దనే ఉంచి పెంచుతోంది. తనకు కుమారుడు లేడనే బాధ లేదని...కుమార్తె ఆ లోటు తీరుస్తోందని చెబుతున్నారు ధనలక్ష్మి.

హేళన చేసిన వారి నుంచే ప్రశంసలు అందుకొని..


ఇద్దరు కుమార్తెలతో పోలినాయుడు దంపతులు

చాపర గ్రామానికి చెందిన మజ్జి పోలినాయుడు, జ్ఞానేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఆడపిల్లల తండ్రి అని పోలినాయుడుకు అందరూ మొదట్లో హేళన చేసేవారు. దీంతో ఎలాగైనా కుమార్తెలను ఉన్నత స్థానంలో చూడాలలనే పట్టుదలతో పోలినాయుడు వారిని చదివించాడు. పెద్ద కుమార్తె తరుణశ్రీ ఇంజనీరింగ్ పూర్తి చేసి. ప్రస్తుతం సచివాలయ ఇంజనీరింగ్ శాఖలో పని చేస్తున్నారు. రెండో కూమార్తె మేఘన ఇంజనీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఒకప్పుడు హేళన చేసిన వారే ఇప్పుడు ఆ ఆడపిల్లలను ఆదర్శంగా తీసుకోవాలని తమ బిడ్డలకు చెబుతున్నారని... ఇది ఎంతో ఆనందాన్నిస్తోందని అంటున్నారు పోలినాయుడు.

ఆటల్లో రాణించి.. ఆదర్శంగా నిలిచి..


అమ్మ, నాన్న, తమ్ముడితో అక్కాచెల్లెళ్లు

రణస్థలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరానికి చెందిన గురుమూర్తి సాధారణ ఆర్టీసీ డ్రైవర్. ఆయన భార్య సూర్యకుమారి. వీరికి సుశీల, విజయలక్ష్మి, లక్ష్మి అనే ముగ్గురు కుమార్తెలతో పాటు ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెలు తల్లిదండ్రులు పడుతున్న బాధను చూసి క్రీడలపై దృష్టిపెట్టారు. క్రీడల్లో రాణించి వ్యాయామ ఉపాధ్యాయ శిక్షణ పొందారు. తరువాత ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ కొలువులు సాధించారు. పెద్ద కుమార్తె సుశీల పాత్రునివలస హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త శ్రీరాములు కూడా ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్నారు. రెండో కుమార్తె విజయలక్ష్మి పెద్దపాడు ప్రభుత్వ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమె భర్త నిర్మల కృష్ణ కూడా ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్. ఇక చిన్నకుమార్తె లక్ష్మి కోష్ఠ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త వెంకటేష్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్నారు.

తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ..


తండ్రి గౌతు శివాజీతో ఎమ్మెల్యే శిరీష

శ్రీకాకుళం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో తండ్రుల వారసులుగా కొడుకులు ఉండడం చూస్తుంటాం. కానీ దీనికి భిన్నంగా తండ్రి నాయకత్వ లక్షణాలను పుణికిపుచ్చుకొని రాణిస్తున్నారు ఆమె. రాజకీయ ప్రత్యర్థులపై పోరాటంలోనూ... ప్రజల సమస్యల పరిష్కారంలోనూ తనదైన శైలిలో ముందుకెళుతున్నారు. ఆమె పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష. కుమార్తెల దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 'మా తాత సర్దార్ గౌతు లచ్చన్న. మా నాన్న గౌతు శ్యామసుందర శివాజీ. మా తల్లిదండ్రులకు నేను, మా చెల్లి సంతానం. కొడుకులు లేకపోతే వంశం ఏమవుతుందని మా నాన్న ఆలోచించలేదు. చిన్నప్పటి నుంచి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛను ఇచ్చారు. ఆ స్వేచ్ఛను మేం గౌరవించాం. నన్ను ఇంజ నీరింగ్ చదివించాలన్నది నాన్న కోరిక. నాకు ఫిజిక్స్ అంటే భయం. చెల్లి కూడా 'లా' చేసింది. నాన్న మమ్మల్ని చదివించాలన్నది కాకుండా మాకు ఇష్టమైన సబ్జెక్టులను చదివాం. ఏనాడూ అడ్డుచెప్పలేదు. నా వివాహం గురించి ముందుగా నాన్న, తాత వద్ద ప్రస్తావించాను. ఇద్దరూ అంగీకరించారు. మేం కూడా మా నాన్న ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయలేదు. రాజకీయాల్లో కూడా ప్రోత్సహిస్తునే వచ్చారు. ప్రతి ఆడపిల్లకు పెళ్లయినంత వరకు తండ్రి ప్రోత్సాహం ఉంటే అద్భుతంగా రాణించగలరు. పెళ్లయ్యాక భర్త కూడా ప్రోత్సహిస్తుంటే ఎటువంటి లక్ష్యాన్నైనా మహిళలు సాధించగలరు.

పేదరికాన్ని జయించారు..


ముగ్గురు అక్కాచెల్లెళ్లు

సోంపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం రుషాభ ద్రకు చెందిన పల్లి సవరయ్య, మోహినమ్మలది నిరుపేద కుటుంబం. వీరికి ముగ్గురు ఆడపిల్లలు పల్లి కుమారి, పల్లి శైలజ, హేమంతాలు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. కానీ ఆ తల్లిదండ్రులు నిరుత్సాహ పడలేదు. అందరిలా పిల్లలను పనిలో పెట్టుకోవాలనుకోలేదు. తమ పిల్లలు తమలా కాకుండా ఉండాలని భావించారు. ఎంతో కష్టపడి ముగ్గురిని చదివించారు. ముగ్గురూ బీఈడీ పూర్తి చేశారు. 2019 అక్టోబర్‌లో ముగ్గురూ సచివాలయ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. దీనితో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈ ముగ్గురు పిల్లలు తల్లిదండ్రులకు కష్టం లేకుండా చూసుకుంటున్నారు. మూడు నెలల కిందట తండ్రి సవరయ్య అనారోగ్యంతో కన్నుమూశారు. ఇటీవల డీఎస్సీలో పెద్ద కుమార్తె కుమారి ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. తమ తల్లిదండ్రుల రుణం తీర్చుకోలేమని చెబుతుంటారు ఆ ముగ్గురు అక్కాచెల్లెళ్లు.

'అమృత్ భారత్' వచ్చేసింది

(ఏడో పేజీ తరువాయి)

ఆర్థిక సంస్కరణలతో ప్రపంచ దేశాల్లో భారత్‌కు ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంతోపాటు జిల్లా కూడా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో రైల్వేసేవలు మెరుగుపరుస్తాం. గతంలో వందేభారత్, ఇప్పుడు అమృత్‌భారత్ రైళ్లరాకపోకలతో జిల్లావాసులకు మరిన్ని సేవలు అందనున్నాయి. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్, తిరుపతి ప్రాంతాలకు ప్రత్యేక రైలు ఏర్పాటుకు కృషి చేస్తున్నా. పలాస రైల్వేస్టేషన్‌లో రూ.64కోట్లతో అభివృద్ధి పనులు చేపడతాం. వివిధ స్టేషన్లలో అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామ'ని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, రైల్వే డీఆర్ఎం లలిత్ బొహ్రా, డీసీఎం పూజసింగ్, డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పేడాడ రామ్మోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కార్పొరేషన్‌కు 78వ ర్యాంకు

(ఏడో పేజీ తరువాయి)

వీధి దీపాలు, ఆదాయం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ప్రకటించింది. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో వివిధ విభాగాలకు సంబంధించి లభించిన స్కోరును పరిశీలిస్తే.. నీటి సరఫరాకు - 7, ఇంటి నుంచి చెత్త సేకరణకు - 6, లెగసీ వేస్ట్‌కు - 4, పక్కా రోడ్లకు - 10, వీధి లైటింగ్‌కు - 6, ఆదాయ విభాగంలో - 10, రెవెన్యూ విభాగంలో 10 పాయింట్లు వచ్చాయి. వేస్ట్ ప్రోసెసింగ్ స్కోర్, లిక్విడ్ వేస్ట్ స్కో ర్, స్టార్మ్ వేస్ట్ స్కోర్ సున్నా లభించింది. ఇంతకంటే దారుణంగా ఇచ్ఛాపురం, ఆమదాల వలస, పలాస కాశీబుగ్గ మునిసిపాలిటీలకు 4వ ర్యాంకింగ్ లభించింది. అన్ని విషయాల్లో నూ ఈ మూడు మునిసిపాలిటీలు తిరోగమనంలో ఉన్నట్లు నివేదిక ద్వారా స్పష్టమవుతోంది.

వీధుల్లో వర్షపునీరు ఉండరాదు

(ఏడో పేజీ తరువాయి)

సూచించారు. పట్టణంలో నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు సమన్వయం పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, సహాయ ప్రణాళికాధికారులు వెంకటేశ్వరరావు, జానకి, మునిసిపల్ హెల్త్ అధికారి సుధీర్‌కుమార్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాది.. అడ్డదారి!

(ఏడో పేజీ తరువాయి)

బడా వ్యాపారులు సైతం రేషన్ కార్డులు కలిగి.. ప్రభుత్వ పథకాలు పొందడం గమనార్హం..

● జిల్లాలో 600కు పైగా హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలు ఉండగా నరసన్నపేట పట్టణంలో సుమారు వంద వరకు బంగారం దుకాణాలు ఉన్నాయి. వీటిలో 30 దుకాణాలను బడా వ్యాపారులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు దొడ్డిదారిలోనే బంగారం విక్రయిస్తున్నారని సమాచారం. వారికి పోలీసుల నుంచి ఇబ్బంది లేకుండా తాను అంతా చూసుకుంటానని ఒక హోల్‌సేల్ బంగారం వ్యాపారి భరోసా కల్పించినట్లు తెలుస్తోంది. ఆ వ్యాపారి నరసన్నపేట పోలీసు ఉన్నతాధికారులకు ఇటీవల కలిసి.. తమ వ్యాపారాలకు సహకరించాలని కోరినట్లు సమాచారం. కాగా అక్రమ వ్యాపారాలపై అధికారులు మరింత నిఘా పెడితే.. దొడ్డిదారిలో వచ్చే బంగారం గుట్టురట్టయ్యే అవకాశం ఉంది.

దాడులు చేస్తేనే..

నరసన్నపేటలోని గుడ్ల నాగరాజుకు చెందిన జీఎస్ఆర్ బంగారం దుకాణంలో కొన్నాళ్ల కిందట బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ అధికారులు దాడులు చేశారు. నకిలీ హాల్‌మార్క్ బంగారం ఆభరణాలు విక్రయిస్తున్నట్టు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. నకిలీ హాల్‌మార్క్ వేసిన షాపుపై కూడా దాడులు చేపట్టారు. తాజాగా శుక్రవారం నరసన్నపేటలో బంగారం దుకాణాలపై కేంద్ర జీఎస్టీ కస్టమ్స్ అధికారులు సోదాలు చేశారు. తమ్మయ్యపేటలోని హోల్‌సేల్ బంగారం వ్యాపారి ఉప్పు గిరి ఇంట్లో సోదాలు చేసి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పేట జంక్షన్‌లోని శ్రీగౌరీ శంకర్ జ్యూయలర్స్ షాపులో కూడా దాడులు చేశారు. ఇటీవల తమిళనాడులోని కోయంబత్తూరులో బంగారం వ్యాపారి నుంచి నరసన్నపేటకు చెందిన వ్యాపారులు భారీ మొత్తంలో జీరో ట్యాక్స్‌లో లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు. దీనిపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. ఇదే మాదిరి బీఐఎస్, తూనికలు కొలతలు, రెవెన్యూ, పోలీసు, జీఎస్టీ, ఆదాయపు పన్ను అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహిస్తే బంగారం వ్యాపారుల అక్రమాలు మరిన్ని బయటపడతాయని పలువురు పేర్కొంటున్నారు.

అసెంబ్లీలో మనవాణి

ఏనాటి కులస్థుల సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏనాటి కులస్థులకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో ఏనాటి కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తవించారు. ఏనాటి కులాల వారికి ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు అందజేసేవారని.. కాంగ్రెస్ పాలనలో నిలిపివేసి.. ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. దీంతో వారు ఓసీలుగా మిగిలిపోయారన్నారు. అలాగే పట్టణాల్లో నివశించే పొందరి కులాలకు బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే రమణమూర్తి కోరారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

● ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలస, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ విద్యా విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా సమాన వేతనం మంజూరు చేయాలని పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు మినిమం టైం స్కేల్ విధానంతో జీతాలు అందిస్తున్నారని తెలిపారు. కేజీబీవీ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, మహిళా ఉద్యోగులకు మాత్రం కనీస వేతనం కూడా అందడం లేదన్నారు. కేజీబీవీ మహిళా ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ద్వారా వేతనాలు అందించాలని 2022లో సుప్రీం కోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కేజీబీవీలఅ నిర్వహణతో పాటు ఉపాధ్యాయులను కూడా పట్టించుకోలేదన్నారు. కేవలం రూ.5 వేలు మాత్రమే వేతనం పెంచి అన్యాయం చేశారని ఆయన సభదృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌లు స్పందించి.. కేజీబీవీల్లో సమాన పనికి సమాన వేతనం కల్పించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ కోరారు.

అక్టోబరు 1న అవతరణ దినోత్సవంగా ప్రకటించాలి

● ఎమ్మెల్యే ఎన్ఈఆర్



రణస్థలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏటా అక్టోబరు ఒకటో తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా ప్రకటించాలని... అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగానికి మనం ఇచ్చే ఘన నివాళి ఇదేనని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. 1953లో అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ వాసులు ప్రత్యేకంగా ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు దశాబ్ద కాలంగా అవతరణ దినోత్సవం లేదని... అక్టోబరు 1న ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవంగా ప్రకటించాలని కోరారు. ఈ వేడుకలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించండి

● ఎమ్మెల్యే గొండు శంకర్



అరసవల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం పట్టణ పరిధిలో గల 15 ప్రాంతాలలో తరతరాలుగా నివసిస్తున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శాసనసభలో శనివారం రెవెన్యూ శాఖ మంత్రిని కోరారు. నగర పరిధిలోని చౌదరి సత్యనారాయణ కాలనీ, నీలమ్మ కాలనీ, బర్మా కాలనీ, బాయమ్మ తోట, పెద్దరెల్లి వీధి, పీఎఎన్ కాలనీ, నారాయణ తిరుమల ప్రాంతం, దమ్మల వీధి, మంగువారి తోట, సీపన్నాయుడు పేట, భైరివాని పేట వంటి 15 ప్రాంతాల్లో అనేక మంది తరాలుగా నివసిస్తున్నారని తెలిపారు. వారంతా ఇంటి, నీటి పన్ను, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారని తెలిపారు. కానీ వారికి నేటికీ పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వనందున చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే గత ప్రభుత్వం 'సిక్స్ స్టెప్స్' ద్వారా సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందని, దీని వల్ల అర్హులు కూడా నష్టపోతున్నారని అన్నారు. దానిని సవరిస్తే బాగుంటుందని విన్నవించారు. గార మండలం అంపోలు గ్రామంలో బ్రహ్మగుండం చెరువు కింద ఆయకట్టు లేదని...అక్కడ 300 మంది ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇప్పుడు కోర్టు కూల్చేయమనడంతో వారంతా రోడ్డున పడతారని, దీనికి సత్వర పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.

వైభవంగా నరసింహ స్వామి యజ్ఞం


విశేష అలంకరణలో స్వామి వారు

రణస్థలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బంటుపల్లి పంచాయతీ పరిధిలో గల ఎస్‌కేసీఎం గోసేవ ఆశ్రమంలో శ్రీ ప్రహ్లాద వరద నరసింహ స్వామి యజ్ఞాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


హోమంలో పాల్గొన్న భక్తులు

అమృత్ భారత్ రైలుకు ఘన స్వాగతం


అమృత్ భారత్ రైలును ప్రారంభిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

పలాస, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ రైలుకు పలాస రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. వర్చువల్ విధానం ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బరంపురం (ఒడిశా)లో ఈ రైలును శనివారం మధ్యాహ్నం ప్రారంభించారు. పలాసలో 2.20 గంటలకు ఈ రైలుకు స్థానిక నాయకులు, రైల్వే అధికారులు స్వాగతం పలికారు. అనంతరం దీన్ని రైల్వే అధికారులు, కూటమి నాయకులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం-2లో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏడీఆర్ఎం ప్రదీప్ కుమార్ బెహరా మాట్లాడుతూ బరంపురంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక మంది పేద, మధ్య తరగతి ప్రజలు సూరత్ వంటి ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు వెళ్తుంటారని తెలిపారు. అటువంటి వారి కోసం ప్రత్యేకంగా అమృత్ భారత్ రైలు వేసినట్టు చెప్పారు. తక్కువ టిక్కెట్ ధరతో సుఖ ప్రయాణం చేసేందుకు వీలవుతుందన్నారు. 22 బోగీలు ఉండే ఈ రైలులో స్లీపర్ కోచ్‌లే ఎక్కువగా ఉంటాయని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు, ఏఎంసీ ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సాధారణ ప్రయాణికులకు కూడా ఆధునిక వసతులతో ఉన్న రైలు ప్రవేశపెట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని వలస కార్మికులు కాండ్లా, సూరత్, భిలాయ్ వంటి ప్రాంతాలకు వెళ్తుంటారని తెలిపారు. వారికి ఈ రైలు ఎంతో వినియోగపడుతుందన్నారు. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ సందేశంతో కూడిన వీడియో చిత్రాలు ప్రదర్శించారు. రైలు ప్రారంభ దృశ్యాలు లైవ్‌లో ప్రదర్శించారు. అంతకు ముందు కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పర్సనల్ అధికారి పి.కె.బెహరా, డివిజన్ సిగ్నల్, టెలికామ్ ఇంజనీరింగ్ అధికారి బీకే జెనా, అసిస్టెంట్ సెక్యూరిటీ కమాండెంట్ ఎస్.సంజయ్, డీసీఎం రమాకాంత్‌హరార్, డీఈఈ కె.శ్రీను, ఎడీఈ ఆర్‌కె.ఖాత్రా, కూటమి నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, జోగ మల్లి, దడియాల నర్సింహులు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్, రామానంద స్వామి, పి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను పరిరక్షించాలి

● జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

గార, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన వారసత్వ సంపదను పరిరక్షించాలని జిల్లా పర్యాటకశాఖాధికారి ఎస్.నారాయణరావు అన్నారు. శాలిహుండాంలోని ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రం వద్ద శనివారం పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో చరిత్ర కలిగిన దేవాలయాలు, విశాలమైన సముద్రతీరం పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, మాజీ ఎంపీపీ గుండ భాస్కరరావు, సర్పంచ్‌లు కె.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


గార: మాట్లాడుతున్న నారాయణరావు

పర్యాటక ప్రాంతాల గుర్తింపుతో అభివృద్ధి

పాతపట్నం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాల గుర్తింపుతో ప్రాంతీయాభివృద్ధి జరుగుతుందని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా తెలిపారు. స్థానిక నీలమణి దుర్గ ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. తీమర, తామర విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తిడ్డిమికి చెందిన కళాకారులచే చెక్క భజనతో ఆకట్టుకున్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పోషణ అభియాన్ పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపీడీవో హెచ్.వెంకట రమణమూర్తి, టీడీపీ నాయకులు పైల బాబ్జీ, సైలాడ సతీష్ పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



పాతపట్నం: మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా


జలుమూరు: పర్యాటక దినోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

'తేలుకుంచి' అభివృద్ధికి చర్యలు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తేలుకుంచి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటామని మండల ప్రత్యేకాధికారి సీహెచ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని తేలుకుంచి పక్షుల సంరక్షణ కేంద్రంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటరావు, ఎంపీడీవో రామారావు, సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

శ్రీముఖలింగాన్ని అభివృద్ధి చేయాలి

జలుమూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగం ప్రముఖ పర్యాటక కేంద్రమని, దీనిని మరింత అభివృద్ధి చేయాలని జలుమూరు ఏఎంసీ చైర్మన్ తర్ర బలరాం అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని శనివారం శ్రీముఖలింగం వచ్చే భక్తులకు ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంఈవో బి.మాధవరావు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో మంచి అవకాశాలు

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యాటకంగా అభివృద్ధికి తీరప్రాంతంలో మంచి అవకాశాలు ఉనాయని సోషల్ వెల్ఫేర్ డీడీమధుసూదనరావు అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆధ్వర్యంలో రూ.30 కోట్లతో టూరిజం ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ నాయుడు, టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, పి.విఠల్‌రావు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పర్యాటక కేంద్రంగా తయారు చేయాలి

పోలాకి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశిలోని తొమ్మిది శతాబ్దాల నాటి శిలాశాసనం ఉన్న ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పలువురు కోరారు. శనివారం దీర్ఘాశి దుర్గాగిరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ప్రత్యేకాధికారి ఏడీఏఎల్.వెంకటమధు, ఎంపీడీవో రవికుమార్ సర్పంచ్ మెండ కృష్ణుమంగళి, నాయకులు బైరి భాస్కరరావు, ఎంపీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీరోజూ విశాఖకు ప్యాసింజర్

కంచిలి, సెప్టెంబరు27(కంచిలి): బరంపురం నుంచి విశాఖపట్నం వెళ్లే (58531-58532) రైలు ఇకపై ప్రతి రోజూ రెగ్యులర్‌గా నడుస్తుందని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జడ్‌ఆర్ యూసీసీ సభ్యుడు శ్రీనివాస్ రౌలో ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ ఇంటర్ లాకింగ్ పనులు నిమిత్తం గత నెల రోజులుగా వారానికి మూడు రోజులు మాత్రమే నడిచిందని, పనులు పూర్తయినందున ప్రతిరోజూ నడిపేందుకు రైల్వేశాఖ అధికారులు నిర్ణయించారని, ఈ విషయాన్ని నియోజకవర్గ ప్రజలంతా గమనించా లని తెలిపారు. ● బరంపురం నుంచి ఉదన్(సూరత్)కి వేసిన అమృత్ భారత్ రైలుకు పలాస రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వడంపై జడ్‌ఆర్‌యూసీసీ మెంబర్ శ్రీనివాస రౌలో హర్షం వ్యక్తం చేశారు. పలాసలో ఈ రైలు స్వాగతం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ రైలు ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. గుజరాత్, అహ్మదాబాద్, భిలాయ్, రాయపూర్ తదితర ప్రాంతాల్లో పని చేస్తున్న కార్మికుల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

కళింగపట్నం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

గార రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గార మండలం కళింగపట్నం పంచాయతీ సర్పంచ్ తమ్మిన మౌనిక రాణి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం జరిగాయని స్థానికుల ఫిర్యాదు మేరకు సంబంధిత అధికారులతో విచారణ చేపట్టారు. అయితే పనులకు సంబంధించిన సరైన బిల్లు కాపీలు చూపనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, వాటి వివరాలు, చెల్లింపు జరిగిన బిల్లులు తదితర అంశాలపై పూర్తి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.

దివ్యాంగులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

రణస్థలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఆధ్వర్యంలో భారత కృత్రిమ అవయవాల సంస్థ సహకారంతో శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరికి అవసరమైన ఉపకరణాల కోసం ఎంపికలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఏపీసీ ఎస్.శశిభూషణ్, జిల్లా సహిత విద్య కోఆర్డినేటర్ బి.గోవిందరావు మాట్లాడుతూ.. వైద్య పరీక్షలు చేసి ఎంపిక చేసిన వారికి అత్యంత విలువైన వీల్ ఛైర్స్, ట్రై సైకిల్స్, రోలేటర్ వినికిడి యంత్రం, బ్రెయిలీ కిట్, ఎంఆర్ కిట్ తదితర ఉపకరణాలు త్వరలో అందజేయనున్నామన్నారు.

ఆదిత్యునికి విరాళాలు


దాతలకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న దృశ్యం

అరసవల్లి, సెప్టెం బరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత అరస వల్లి సూర్యనారాయణ స్వామికి తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన విశ్వేశ్వరరావు దంపతులు, శ్రీకాకుళానికి చెందిన బీహెచ్ విజయలక్ష్మి రూ.లక్ష చొప్పున విరాళం అందించారు. ఈ మేరకు శనివారం వారు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చెక్కును ఆలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వెంకటరమణ, ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మలకు అందించారు. దాతలకు వారు జ్ఞాపిక లను అందించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్లు బీఎస్ చక్రవర్తి, బాల భాస్కరసాయి, అర్చకుడు ఇప్పిలి ఫణీంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మెచ్చిన సాహితీవేత్త జాషువా


జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ బి.అడ్డయ్య

ఎచ్చెర్ల, సెప్టెం బరు 27(ఆంధ్ర జ్యోతి): ప్రజలు మెచ్చిన సాహితీవేత్త జాషువా అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య అన్నారు. వర్సిటీలో నవయుగ కవి చక్రవర్తి, కవితా విశారద గుర్రం జాషువా జయంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజికంగా ఉన్న మూఢాచారాలను తన కవిత్వం ద్వారా ఎదిరించారన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సంద ర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, 9 నెలల ఏరియర్స్ ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఇంటింటి సర్వేల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ బూరాడ మధు, సంఘం నేతలు గోవిందరావు, మహేష్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ ఆఫీసర్‌గా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

ఆమదాలవలస, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస అగ్నిమాపక కేంద్రం అధికారిగా సనపల శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తూరు అగ్నిమాపక కేంద్రం డ్రైవర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. శ్రీనివాసరావును సిబ్బంది బొకే ఇచ్చి అభినందించారు.

శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం

సోంపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. చేపలగొల్లగండి గ్రామంలో దుర్గా కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధరలు తగ్గించేందుకు ముందుకురావాలి

● జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వప్నదేవి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ధరలు తగ్గించేందుకు వ్యాపారులు స్వచ్ఛం దంగా ముందుకు రావాలని జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, సూపర్ జీఎస్టీ సేవింగ్స్ నోడల్ అధికారి స్వప్నదేవి కోరారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జీఎస్టీ ధరల తగ్గింపుపై వ్యాపారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్స్, మెడికల్, ఆటో మొబైల్స్, వ్యవసాయ యంత్రాలు, ఎరువులు, ఎంఎస్ఎంఈలు, ప్యాకింగ్ మెటీరియల్, హెల్త్ ఇన్సూరెన్స్ తదితర వస్తువుల ధరలు తగ్గడం వల్ల రూ.8 వేల కోట్లు ప్రజలకు మిగులుతాయన్నారు. దుకాణాల వద్ద పాత, కొత్త ధరలతో బ్యానర్లను ఏర్పాటు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపుపై చైతన్యం చేస్తారన్నారు. ఈ సందర్భంగా వ్యాపారుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. సమావేశంలో అసిస్టెంట్ జీఎస్టీ అధికారి చంద్రకళ, బంగారం, రైస్ మిల్లర్లు, హోటళ్లు, కిరాణా, ఆటో మొబైల్, సిమెంట్, ఇంజనీరింగ్ తదితర వ్యాపార సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.


వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వప్నదేవి

చిన్నారుల ప్రదర్శనలు అభినందనీయం

● డీఆర్వో వేంకటేశ్వరరావు



భక్తిగీతాలను ఆలపిస్తున్న చిన్నారులు

అరసవల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో మన సంస్కృతీ, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ చిన్నారులు ఆధ్యాత్మిక ప్రదర్శనలు అభినందనీయమని డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు అన్నారు. స్థానిక బాపూజీ కళా మందిర్‌లో ఆరోహి సంగీత పాఠశాల విద్యార్థుల భక్తి సంగీత విభావరి శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే శాస్త్రీయ సంగీతం అభ్యసిస్తూ భక్తిభావం అలవరచుకుని జీవితంలో గొప్పగా ఎదగాలన్నారు. తొలి శాస్త్రీయ సంగీత ప్రదర్శన చేసిన ఆర్యమిత్రకు జ్ఞాపిక అందించి అభినందించారు. కార్యక్రమంలో సీటీవో రాణీమోహన్, డా.మాలతి, సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ పెంకి నాగేశ్వరరావు, కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి నిధులు మంజూరు చేయండి


మంత్రి రామనారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సోంపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బారువలోని పురాతన జనార్దన స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మడ్డు కుమార్ కోరారు. ఈ మేరకు అమరావతిలో శనివారం మంత్రులు నారా లోకేష్, ఆనం రామనారాయణ రెడ్డిలను ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శివాజీలతో కలిసి వినతి పత్రాలు అందించారు. అలాగే పార్టీ కార్యాలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వలసల నివారణకే ఉపాధి పనులు

● ఉపాధి విజిలెన్స్ అధికారి లవరాజు

గార, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో వలసల నివారణకు ఉపాధి హామీ పథకం పనులను ప్రభుత్వం అమలు చేస్తోందని ఈ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీకి సంబంధించిన వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. 2024-25లో గార మండలంలో చేపట్టిన ఉపాధి పథకం పనులు పరిశీలనకు డీఆర్పీ బృం దాలు గ్రామాల్లో త్వరలో పర్యటిస్తాయన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వి.సత్యనారాయణ, సోషల్ ఆడిట్ ఎస్సార్పీ సూర్యనారాయణ, ఏపీవో సీహెచ్ సంధ్యారాణి, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

శ్రీకాకుళం అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఈ మేరకు శనివారం పెద్ద పాడులోని పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ క్యాడర్‌పై తప్పుడు కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దసరా సందడి


టెక్కలి: ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో లలితా పారాయణం..


నరసన్నపేట: అలంకరణలో స్వామివారు


వజ్రపుకొత్తూరులో..


జలుమూరు: శ్రీముఖలింగం వారాహి అమ్మవారి సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు

● వివిధ రూపాల్లో దుర్గమ్మ దర్శనం

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. శనివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గుర్గమ్మను ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక కుంకు పూజలు, దీపారాధన, లలిత పారాయణం చేపట్టారు.
- ఆంధ్రజ్యోతి బృందం



ఆమదాలవలస: బూర్జ మండలం కొరగాం గ్రామంలో దీపాలంకరణ..


పాతపట్నం: లలితాత్రిపుర సుందరిగా నీలమణి దుర్గమ్మ..


నందిగాం: నీలమణిదుర్గ ఆలయంలో 108 రకాల వంటకాలతో నైవేద్యం


సోంపేట: లలితాత్రిపుర సుందరిగా సోమపోలమాంబ


ఇచ్ఛాపురం: కాత్యాయినిగా స్వేచ్ఛావతి అమ్మవారు


కవిటి: గొండ్యాలపుట్టుగలో కూరగాయల అలంకరణలో భూలోకమాత


టెక్కలి: ఐతమ్ కళాశాలలో దసరా సంబరాలు

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాజారావు (ఫైల్)

నరసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కంబకాయి గ్రామానికి చెందిన కెల్లా రాజారావు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందినట్టు ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. అత్తవారింట్లో ఉంటున్న రాజారావు బాధ్యత మరచి తిరుగుతుండడంతో భార్య మందలించింది. దీంతో మనస్తాం చెందిన రాజారావు ఈనెల 26న గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రాజారావు స్వగ్రామం సరుబుజ్జిలి మండలం చిగురువలస గ్రామం. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

గంగమ్మతల్లి ఆలయంలో చోరీ

నరసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెన్నాపురం గ్రామంలోగల గంగమ్మతల్లి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరి జరిగిందని ఆలయ ధర్మకర్త ముత్తా సింహాచలం శనివారం పోలీసులుకు ఫిర్యాదు చేశారు. ఆలయంలో గల హుండీ, అమ్మవారి బంగారం ముక్కుపుడక చోరీకి గురైనట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రూ.60వేలు విలువ చేస్తాయని ధర్మకర్త తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

13 పశువులు పట్టివేత

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెద్దపాడు జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం లగేజీ వ్యాన్‌లో తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్ఐ కె.రాము తెలిపారు. తొమ్మిది ఆవులు, నాలుగు దూడలను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన ధర్మాన రమేష్, కోటబొమ్మాళి మండలం నారాయణవలసకు చెందిన సురవరపు కృష్ణారావులపై కేసు నమోదు చేశామన్నారు. పశువులను గోశాలకు తరలిస్తామన్నారు.

సబ్‌జైలు సందర్శన


ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయాధికారి వాణి

నరసన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును శనివారం మునసిఫ్ కోర్టు సివిల్ న్యాయాధికారి వాణి శనివారం సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

ఈస్ట్‌కోస్ట్ సలహామండలి సభ్యుడిగా రాజేష్


రాజేష్‌ను అభినందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్

అరసవల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పాలకమండలి సభ్యుడు, ఐతం కళాశాల డీన్ బుడుమూరు రాజేష్, ఈస్ట్‌కోస్ట్ సంప్రదింపుల సలహా మండలి బోర్డు సభ్యుడిగా నామినేట్ అయ్యారు. ఈ మేరకు ఆయనను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధత కలిగిన బీసీ నాయకుడికి ఈ పదవి రావడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

నరసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణించేందుకు తగిన తర్ఫీదును ఇప్పించాలని లయన్స్ క్లబ్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ సూచించారు. జాతీయ స్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీల్లో రాణించిన కంబకాయి గ్రామానికి చెందిన పోగోటి సతీష్ రూ.15వేలు శనివారం సాయంగా అందజేశారు. నవంబరు 27 నుంచి 29వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు టి.రత్నాజీ, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి కె.రమేష్, రమణ సాహూ, ఉణ్న రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాభిషేకం కోసం భిక్షాటన


భిక్షాటనలో పాల్గొన్న బాబా భక్తులు

పలాస, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): షిర్డీ సాయి విగ్రహానికి అన్నాభిషేకం చేసేందుకు సాయిభక్తులు భిక్షాటన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. రెండు రోజులపాటు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో భిక్షాటన చేస్తారు. పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో వెలసి ఉన్న షిర్డీసాయి ధ్యానమందిరంలో ఏటా విజయదశమి సందర్భంగా అన్నాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం వాటిని ప్రసాదంగా భక్తులకు అందిస్తారు. ఈ క్రమంలో భక్తులు జోలె పట్టుకొని ఇంటింటా బియ్యం, సామగ్రి సేకరిస్తున్నట్టు మందిర కార్యదర్శి గిన్ని జయశంకర్‌రెడ్డి తెలిపారు.

పారిశుధ్యంపై దృష్టిసారించండి


పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్

పలాస, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నెలవారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకొని పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శనివారం స్థానిక మునిసిపాలిటీలో పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ ఎన్.రామారావుతో కలసి పరిశీలించారు. పారిశుధ్యం మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉప్పరిపేట, డంపింగ్ యార్డ్‌లను ఆయన పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను సత్వరంగా తొలగించాలని ఆదేశించారు. జంటపట్టణాల్లో అనేక వార్డులు ఆయన పర్యటించారు. ఆయన వెంట పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

యూరియా అందించాలి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): యూరియా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని తక్షణం అందించాలని జడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. శనివారం తహసీల్దార్ ఎన్.వెంకటరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఇచ్ఛాపురం మండలంలో సుమారు 7,789 ఎకరాల్లో నాట్లు వేస్తే, 556 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే అందజేయడంతో ఇబ్బందిపడుతున్నార న్నారు. దీంతో ఒడిశా వెళ్లి అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నారన్నారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి


చంద్రబాబుకు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మెళియాపుట్టి/ పాతపట్నం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఐటీడీఏ లేక ఇబ్బంది పడుతున్నారని మెళియాపుట్టిలో ఏర్పాటు చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. రాజధాని అమరావతిలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి వినతి పత్రం అందజేశారు. గత ప్రభుత్వం జిల్లాల విభజన చేసి అన్యాయం చేసిందని తెలిపారు. అలాగే నియోజకవర్గాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులతో పాటు గతంలో ప్రతిపాదలను ఉన్న ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఐటీఐ, పాలిటెక్నిక్, మహిళా జూనియర్ కళాశాల మంజూరు చేయాలని విన్నవించారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

కొత్తూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కడుము కాలనీ పాఠశాల ఆవరణలో కొంతమంది అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన కొంతమంది నిరసన తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాల ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల ఆవరణలో ఇల్లు నిర్మాణానికి స్లాబ్ వేసేందుకు స్థానికులు ఒకరు సమాయత్తం అవుతుండగా స్థానికులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాటకు దారితీసింది. విషయం తెలుసుకున్న సీఐ, ఎస్ఐలు సీహెచ్ ప్రసాద్, ఎండీ అమీర్ అలీ ఇరువర్గాలతో మాట్లాడి సర్ది చెప్పారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండవని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

నరసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పోగోటి ఉమామహేశ్వరి అన్నారు. శనివారం కంబకాయి గ్రామంలో స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియన్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ప్రతీ మహిళ క్యాన్సర్, బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించుకోవాలన్నారు. మాకివలస పీహెచ్‌సీ వైద్యులు శిరీష, చల్ల కన్నంనాయుడు పాల్గొన్నారు.

లోక కల్యాణ్ మేళాపై అవగాహన

పలాస, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పీఎం స్వనిధి 2.0 లోక కల్యాణ్‌మేళాపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం మధ్యాహ్నం నిర్వహించారు. సిటీ మిషన్ మేనేజర్ మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్.వెంకటరావు మాట్లాడుతూ వీధి విక్రయదారులు, చిన్నవ్యాపారులు పీఎం స్వనిధి 2.0 ద్వారా మూడో విడత వరకూ రుణ సౌకర్యం పొందవచ్చన్నారు. మొదట విడతలో రూ.15వేలు, రెండో విడతలో రూ.25వేలు, మూడో విడతలో రూ.50వేలు వరకు రుణం అందించనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకూ రుణాలు పొందని వారు మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎ.శ్రీకాంత్, జిల్లా మెప్మా అధికారి ఎల్‌హెచ్ కిషోర్, ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీరాములు, యూపీఏ మేనేజర్ ధనుంజయ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో తప్పెటగుళ్ల బృందం

నరసన్నపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించనున్న గరుడ వాహనసేవలో మాడవీధుల్లో నారాయణవలస తప్పెడ గుళ్ల బృందం పాల్గొనేందుకు ఆహ్వానం వచ్చింది. ఈ మేరకు 25 మంది సభ్యులు శనివారం తిరుమల చేరుకొని రిపోర్టు ఇచ్చినట్టు ఆర్గనైజర్ శిమ్మ లక్ష్మణరావు తెలిపారు.

వృత్తి విద్యతో భవిష్యత్తు బంగారం


నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న విద్యార్థులు

పాతపట్నం సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించడంలో ఆచరణాత్మక వృత్తి విద్య క్రియాశీలక భూమిక పోషిస్తుందని ప్రభుత్వ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ నిర్వహించారు. మండల పరిధిలోని వివిధ ఇంటర్‌నెట్ సెంటర్లు, ఫొటో స్టుడియోలు, మీసేవా కేంద్రాల్లో, నర్సరీ, ఎరువుల దుకాణాలు, బియ్యం మిల్లులు, ఎలక్ట్రికల్ షాపులు క్షేత్రస్థాయి పరిశీలన శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వృత్తివిద్య సమన్వయకర్తలు జి.శంకరరావు, బి.తి రుపతిరావు, ఐటీ ట్రైనర్ పి.కరణ్ కుమార్, అగ్రికల్చర్ ట్రైనర్ బలగ రమ్య, ఎలక్ట్రానిక్ ట్రైనర్ ఎస్.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా యూరియా పంపిణీ

పాతపట్నం సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల సింగుపురం ఆర్ఎస్‌కే పరిధిలోని లాబర గ్రామంలో ఏవో కిరణ్‌వాణి ఆధ్వర్యంలో యూరియా పంపిణీ శనివారం నిర్వహించారు. సింగుపురం ఆర్ఎస్‌కే పరిధిలో 550 యూరియా బస్తాలు చేరగా బోరుభద్ర, సింగుపురం గ్రామాల్లో గురువారం 281 బస్తాలను పంపిణీ చేశారు. అలాగే మిగిలిన 269 బ్యాగులను సింగుపురం లాబర బోరుభద్ర, గురండి తదితర గ్రామాల్లో ముందుగా ఇచ్చిన టోకెన్ల ప్రాప్తికి ప్రతీ రైతుకు అందేలా చర్యలు తీసుకొన్నామని వ్యవసాయాధికారులు తెలిపారు. ఎస్ఐ కె.మధుసూదనరావు పర్యవేక్షణలో యూరియా పంపిణీ జరిగింది.

కొత్తూరులో మెగా రక్తదాన శిబిరం

కొత్తూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురష్కరించుకొని శనివారం కొత్తూరులో మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కపాల దమయంతి ఆధ్వర్యంలో స్థానిక గోగుల కాంప్లెక్స్‌లో యువకులు రక్తదానం చేశారు. ప్రధానమంత్రి జన్మదినంలో భాగంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న రక్తదాన శిబిరాలపై యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో పొగిరి రవి, గండివలస ఆనందరావు చోడవరపు బాలకృష్ణ, నరసింహామూర్తి, వలురౌతు ప్రసాదరావు, యువకులు పాల్గొన్నారు.

తొలగించిన పిచ్చి మొక్కలు

కొత్తూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) కొత్తూరు-1 అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పేరుకుపోయిన పిచ్చిమొక్కలను సర్పంచ్ పడాల కృష్ణవేణి పర్యవేక్షణలో తొలగించారు. అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు, పుట్టలు ఉండడంతో విష సర్పాలు కేంద్రం పరిసరాలకు వస్తున్నాయి. దీంతో బిక్కుబిక్కు మంటూ నిర్వాహకులు, చిన్నారులు గడిపేవారు. చిన్నారులు పడుతున్న ఇబ్బందులు సర్పంచ్ దృష్టికి రావడంతో ఆమె స్పందించి సొంత నిధులు కేటాయించి జేసీబీ సాయంతో పిచ్చిమొక్కలు తొలగించి చదును చేయించారు. దీంతో చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పూడికిపోయిన కాలువలు


మురుగుతో నిండిపోయిన కాలువ

పాతపట్నం రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెద్దలక్ష్మీపురం గ్రామంలో సమారు 70కుటుంబాలు నివసిస్తున్నాయి. అయితే కాలువలు పూడుకుపోవడంతో రోడ్లపై నుంచే మురుగునీరు ప్రవహిస్తుంది. దీంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో బయటకు రావాలంటే భయపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలు నిర్లక్ష్యా నికి గురవడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలు ఏర్పాటు చేయాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు.


రక్షణలేని ప్రయాణం

● కూలేందుకు సిద్ధంగా కిట్టాలపాడు వంతెన
● విరిగిన రైయిలింగ్.. బిక్కుబిక్కుమంటూ రాకపోకలు


ప్రమాదకరంగా ఉన్న కిట్టాలపాడు వంతెన

హిరమండలం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమ కాలువపై కిట్టాలపాడు వద్ద 90వ దశకంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెన అడుగు భాగాన సిమెంటు పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వంతెన రెయిలింగ్ విరిగిపోయాయి. మరికొన్ని ఇనుప చువ్వలు ఆధారంగా వేలాడుతున్నాయి. కిట్టాలడపాడు గ్రామంతో పాటు కూర్మ వైదిక గ్రామం వెళాలంటే ఈ వంతెనే ఆధారం. నిత్యమూ ద్విచక్రవాహనాలు, కార్లు ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తుంటాయి. రెండు దశాబ్దాలుగా ఈ వంతెనకు ఎటువంటి మరమ్మతులు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కాలువకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తే వంతెనను తాకేలా నీటి ప్రవాహం ఉంటుంది. దీంతో శిథిలమైన ఈ వంతెన ఎప్పుడు కూలిపోతుందోనంటూ ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రస్తుతం మరమ్మతులు చేపట్టి, భవిష్యత్తులో కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

విశ్రాంతి భవనం లేక అవస్థలు


భవనం చుట్టూ పిచ్చి మొక్కలు

టెక్కలి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గంగన్నాపేట జంక్షన్‌లో ప్రయాణికుల విశ్రాంతి భవనం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 20ఏళ్ల కిందట నిర్మించిన భవనం పూర్తిగా శిథిలావస్థకి చేరింది. దీంతో బస్సుల కోసం ఆరుబయటే ప్రయాణికులు వేచి ఉం డాల్సి వస్తుంది. టెక్కలి, పాతపట్నం వైపు వెళ్లేవారు ఎండతో పాటు వర్షం కురిసే సమయంలో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త భవనం నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు దివ్యాంగులకు వైద్య పరీక్షలు

మందస, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆదివారం దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలను అందించేందుకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ట్రస్టు వ్యవస్థాపకులు మల్లారెడ్డి భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వివాదాన్ని పరిష్కరించాలి

టెక్కలి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): హిందూపురం శాసనసభ్యులు, సీనియర్ నటులు నందమూరి బాలకృష్ణ, మాజీమంత్రి సీనియర్ నటులు చిరంజీవి మధ్య తలెత్తిన అంతర్గత వివాదాన్ని పరిష్కరించేం దుకు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేస్ చొరవ చూపి సమస్యని పరిష్కరించాలని టెక్కలి సుదర్శన్ థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనని ఇప్పుడు అసెంబ్లీలో ప్రస్తావించడం సబబు కాదన్నారు. వాస్తవాలు ఏమైనా ప్రస్తుతం ఇరువురు సీనియర్ నటులు మధ్య తలెత్తిన వివాదం వల్ల సినీ పరిశ్రమకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకటన విడుదల చేసిన వారిలో థియేటర్ మేనేజర్ బాలకృష్ణ, కమలా కర్, రామకృష్ణ, జానీ తదితరులు ఉన్నారు.

శ్రీముఖలింగేశ్వర ఆలయ హుండీల లెక్కింపు రేపు

జలుమూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర ఆలయంలో గల హుండీలను ఈనెల 29న సోమవారం లెక్కింపు చేస్తున్నట్టు ఆలయ ఈవో వాసుదేవరావు శనిఆరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో గల ధర్మ హుండీలను దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దలు సమక్షంలో ఉదయం 10 గంటలకు తెరచి లెక్కిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు డ్రెస్ కోడ్ పాటించి పాల్గొనాలన్నారు.

ఉచిత వైద్యశిబిరం

సోంపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సేవా వారోత్సవాల్లో భాగంగా గాంధీనగర్‌లో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి బీన వంశీ, పార్టీ ప్రతినిధులు పీతల శేఖర్, టి. విజయ్, నాని, టి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నందిగాం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు పట్ల పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కుమార్ పట్నాయక్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు గ్రామాల్లో డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వాటి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. నీటి నిల్వలు లేకుండా చేయడంతో పాటు దోమలు నివారణకు ఫాగింగ్ చేపట్టాలని, రక్షిత మంచినీటి పథకాలు పరిశుభ్రం చేసి ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. సూచనలు చేశారు.